## క్షణమొక మాయ

పోపూరి సురేష్ బాబు

కాలం అనాదిగా ప్రవహిస్తూనే ఉంది...
సూక్ష్మీకరించబడిన క్షణంలో
క్షణాల పరుగులింతకై వేగిరపడుతూ
ఎదురుచూపుల నిట్టూర్పులలో
అంతులేని అపార్థాల క్షణాలు
అబ్బురపాటుగా నిలిచిన వేళ...
ఆవశ్యమైన ఆ క్షణాల్లోనే
ఒక వంతు మర్మాల ఆంతర్యము
ఎంత అమానవీయం?
కాలం మనసు చేసుకొనే ఒక మాయ
ముసుగు వేసి దొర్లించే
కోటానుకోట్ల క్షణాల ప్రవాహం
మనమే నిర్మించుకున్న
పల్చటి పొర లాంటి జీవితం
ఎటు వెళ్తామో ,ఎక్కడ తేల్తామో
తెలీని ఒక సందిగ్ధతావలోకన
నిరాశామయ నిశీధి బతుకు ...
అది సున్నుండలా దొర్లుతూ
తెగని దారంలా ఉంటూ
అంతు తెలీని దారిలా సాగుతూ...
నిన్ను మోసం చేస్తూ
పరిగెట్టిస్తూ, పరిగెడుతూనే....

***

# పోరాటం

భాగ్యలక్ష్మి అప్పికొండ

అయినోళ్ళేరి
కానోళ్ళేరి
కన్నోళ్ళేరీ
కట్టుకున్నేళ్ళేరీ
ఏరి ఏరి వారేరి
ఎవరు రారే నిను చేరి
పుట్టిన, గిట్టిన నువ్వే ఒంటరి!
ఎప్పటికప్పుడు
గుప్పెడు గుండెల చప్పుడు
వింటూ
నిన్నే నువ్వు నమ్ముకుపో
నీతో నువ్వే నడుచుకుపో
నమ్మకు, నమ్మకు
మనసును నమ్మకు
మాటను నమ్మకు
మనిషిని అసలే
నమ్మకు నమ్మకు
నిన్నే నువ్వు తెలుసుకుపో
నీతో నువ్వే గడుపుకుపో
ఆగకు, ఆగకు
ఎన్నడు ఆగకు
మండే మంటను
ఆరనీయకు
ఎగసే ఉప్పెన
చల్లారనీయకు
నిస్సత్తువ దరిచేరనీయకు
నీ భుజం నువ్వే తట్టుకుపో
నీకై నువ్వే సాగుతుపో
ఎన్నాళ్ళుంటావ్
ఎన్నేళ్ళుంటావ్
కష్టం అంటూ నష్టం అంటూ
పాపం పుణ్యం లెక్కలు వేస్తూ
నీ కర్మను నువ్వే వల్లే వేస్తూ
నీలో నువ్వే తన్నుకుచస్తావ్
నీతో నువ్వే నే కాదంటుంటావ్
గతం తవ్వకు భవితను వెతక్కు
ఈ క్షణాన్నే నమ్ముకుపో
ప్రతిక్షణం జీవించుకుపో!
కళ్ళేలేని
కాళ్లేలేనీ
కుళ్లేపోనీ
అంతంకాని
నీ ఆత్మని
అంతర్మథనం చేసుకుపో
జ్ఞానాన్ని వెలిగించుకుపో!!
నింగి నేల ఏకం కాని
నీరు నిప్పు కలిసే పోని
దిక్కులు చేరి
నివ్వెరపోని
నీ ధర్మం నువ్వదలకపో
దృఢ సంకల్పంతో ముందుకుపో
విజయాలంటూ, ఓటములంటూ
వివరాలడగకు, వెనకడుగేయకు
సమీక్ష అంటూ సాగిలబడకు
నీ తలరాతను నువ్వే రాసుకుపో
ఇది నీతో యుద్ధం నీతో యుద్ధం
సంసిద్ధం అంటూ ఆగక అలవక
నిలువక జడవక బెదరక కుదురగ
ఎరుకగా
పోరాడుతు పో.....పోరాడుతుపో

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

నీవు వచ్చెదవంచునీ నెలవునందు
ఘడియలో వత్సరమ్ములో గడిపినాను
ఎదురు చూసిన గుండియలెండిపోయె
అలసిపోయితినణగారెనాశలన్ని

ఎవ్వరెవ్వరో వచ్చి నా హృదయమందు
దాగి యున్నట్టి భావమర్థమ్ము చేసి
కొందురంచు నా తోడనుందురంచు
తలచిన తలపులన్ని వ్యర్థమ్ములయ్యె

ఒక్కరొక్కరందరును నా యునికి వీడి
వెడలిపోవుచునుండిరి వేరు దిశల
ఎల్లరును నాదు స్వజనులే యింతవరకు
గడచు కాలము, బంధముల్ గతములౌను

ఇది సుదీర్ఘయానమని యాశించి యుంటి
ఎవ్వరును తోడు విడరని యెంచి యుంటి
అరుగుచుండిరి నను వీడి యాప్తజనులు
చిన్నదే పెద్దదనుకొన్న జీవితమ్ము

వత్తునంచును బ్రతుకెల్ల పలికినావు
చరమమిత్రుడవేల యీ దరికి రావు
స్వల్పముగ విందు నీదు సవ్వడులనిపుడు
రమ్ము యీ దశనుండి విశ్రాంతినిమ్ము

COMMENTS